# శాంతి

# SANTI

విశ్వమానవ సాభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

August / ఆగస్టు-2025



**ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే**
**అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్**



**పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్ మహారాజ్**

జననం : 1895 మరణం : 1982

## లోకశాంతి ప్రార్థన

(వ్యక్తి శాంతికి - విశ్వశాంతికి)

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా!
మా లోపలను వెలుపలను మీదను క్రిందను అంతటను
నిండియున్న ఓ సర్వాంతర్యామి! మా లోపల ప్రత్యణువు
నందును ఇమిడి యుండి మా నేత్రములకు నేత్రము,
కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము,
మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము,
ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా! ప్రేమైక మూర్తీ !
నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.
ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల
ఉత్తర దక్షిణముల, ఈ విశ్వము నందంతటను అందరును
నీ దివ్య తేజస్సును గ్రహింతురు గాక!
ఓ సచ్చిదానంద స్వరూపా !
ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యమునను
శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము.
ఓ దేవా! ఇదియే మా మనః పూర్వకమైన ప్రార్థన.

**లోకాస్సమస్తా స్సుఖినో భవంతు !**

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.
- ఋగ్వేద సంహిత

# శాంతి
# SANTI

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

VoL./ సంపుటి : **101**   August / ఆగష్టు-**2025**   No./ సంచిక : **8**

| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన - హరివంశ పురాణం | 2 |
| 2. | ధ్యానము - మాండూక్యోపనిషత్ | 2 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ - అనువాదం : బొప్పన అరుణాదేవి | 4 |
| 4. | ఆనంద రామాయణం - పరిష్కర్త స్వామి సత్యాత్మానంద | 7 |
| 5. | ఏకజీవ వాదము - స్వామి బోధాత్మానంద | 11 |
| 6. | సర్వవేదాంత సిద్ధాంతసారసంగ్రహం<br>భగవత్పాద శ్రీ ఆది శంకరాచార్య విరచితం<br>టీకా-స్వామి బోధాత్మానంద సరస్వతి | 16 |
| 7. | దక్షిణామూర్తి స్తోత్రము - మానసోల్లాసము | 21 |
| 8. | కార్యక్రమములు | 25 |
| 9. | విరాళములు | 26 |

**ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.**

జీవిత సభ్యత్వం రూ. 1000/- లు సాలుసరి రూ. 100/-



# ప్రార్థన

## హరివంశ పురాణం

**శ్లో॥ నాసికాగ్రం సమాలోక్య పరబ్రహ్మ సనాతనమ్**
**నిర్వాతస్థో యథా దీపః ప్రోచ్చరన్ప్రణతస్సదా ।**

**తా॥** నాసికాగ్రమును చూచుచు సనాతన బ్రహ్మ స్వరూపమైన ప్రణవమును పఠించుచు గాలిలేని చోటున్న దీపమువలె నిశ్చలముగా ఉచ్చరించుచు ఎపుడూ నమస్కరించుచుండును.

**శ్లో॥ ప్రణవం వాచకం మత్వా వాచ్యం బ్రహ్మేతి నిశ్చతః ।**
**ఏకాగ్రం సతతం కృత్వా చిత్తం విష్ణౌ సమర్పితమ్ ॥**

**శ్లో॥ వికల్ప రహితం చిత్తం హృదిమధ్యేన్య వేశయత్**

**తా॥** ప్రణవమును వాచకముగా, బ్రహ్మను వాచ్యముగా నిశ్చయముగా తలచుచు శ్రీమహావిష్ణువు యందు సమర్పించిన ఆ చిత్తమును నిరంతరము ఏకాగ్రముగా చేసుకొని వికల్పరహితమైన చిత్తమును హృదయమధ్యమున నిలిపెను.

# ధ్యానము

**కా॥ ప్రణవం హీశ్వరం విద్యాత్ సర్వస్య హృది సంస్థితమ్ ।**
**సర్వవ్యాపిన మోంకారం మత్వా ధీరో న శోచతి ॥**

**తా॥** ఓంకారమును సమస్త ప్రాణులయొక్క హృదయ కుహరమునందును నివసించు ఈశ్వరునిగా తెలిసికొనుము. ఇట్లు ఓంకారమును సర్వవ్యాపిగా తెలిసి కొనినవాడు ధీరుడు. అతడు ఎప్పుడును దుఃఖించడు.

ఓం కారము యొక్క ఉద్దేశమును జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలను సూచించు చున్నదను విషయమును, ఓం కారముల మధ్యనుండు అమాత్ర ఓంకారమే తురీయ మనియు చెప్పుట కొఱకు ఈ అధ్యాయమంతయు రచించబడినది. సర్వ ప్రాణుల యొక్క హృదయకుహరముల యందు వ్యవహరించు జీవశక్తిని ఓంకారము తనలో నిముడ్చుకొని యున్నది. ఈ విషయమే ఓంకారము యొక్క విశాల భావములోను, సంపూర్ణ సూచనలోను స్ఫురించుచున్నదని గౌడపాదుడు ప్రకటించుట సహజముగనే యున్నది. నారదభక్తి సూత్రములలో కూడ భగవంతుడు సర్వాంతర్యామి యని వర్ణించియున్నారు. ఇట్టి ఓంకారమే సర్వహృదయాంతర్వర్తియై సమస్త ప్రపంచమును

పాలించు ప్రభువైన ఈశ్వరుడని చెప్పబడియున్నది. ఈ భావమే గీతలో కూడ వర్ణితమైనది.

ఆ పరమాత్మను సమస్త రూపములయందు జూచుటయే ఆత్మ పరిపూర్ణత్వము లేక ఆత్మజ్ఞానము అనబడుచున్నది. పరిపూర్ణతనందినవాడు తన చుట్టును పరిపూర్ణతనే చూచును. కావున మనలో పరిపూర్ణతా జ్ఞానము కలుగుటయనిన సర్వవ్యాపి పరిపూర్ణమగు ఆత్మజ్ఞానము కలిగియుండుటయే యగుచున్నది. జ్ఞాని దృష్టిలో సర్వము సుందరముగాను, క్రమబద్ధముగాను సమీకృతముగాను అగుచున్నది. అసమీచీనమందు సమీచీనమును, అసుందరమందు సౌందర్యమును, దుఃఖము నుండి పరిపూర్ణ ఆత్మానందమును అతడు పొందుచున్నాడు. ఆ జ్ఞాని దేనిని గ్రహించినను, అది యంతయు ఆనందమైన ఆ సత్యతత్త్వము మూలముగా గలదే యని తెలిసికొనుచున్నాడు. ఈ విధముగా ఈ ఓంకారభావమును సర్వవ్యాప్తి పరబ్రహ్మగా తెలిసికొనినంతనే యాతనికి జీవితములో దుఃఖించుటకు అవకాశమే కలుగదు. బుద్ధిలో వివేచనాశక్తి యభివృద్ధి పొందినపుడే ఆత్మవివేచన బాహ్యాభ్యం తరములందు కలుగుచున్నది. కావున యట్టివానికి దుఃఖాదులు లేవని దృఢముగా శ్రుతి చెప్పుచున్నది. తర్కవాదములనెడి శిలాపర్వతములను ఛేదించి తత్త్వమును చేర్చునట్టి మార్గమే యీ వేదాంతమగుచున్నది.

**(మాండ్యూకోపనిషత్)**

⊞ మీకెప్పుడయినా బాధ కల్గితే– వెంటనే చేయాల్సిన పనులు గుర్తుకు తెచ్చుకొని చేయండి. మీ బాధ తొలగిపోతుంది.
⊞ బాధపడటం సోమరి లక్షణం దాన్ని వదిలేయండి.
⊞ నిరంతరం పనిచేస్తూ పోయేవాడికి సమస్యలు పరిష్కరించడం కూడా ఓ పని మాత్రమే.
⊞ మీకు తెలివితేటలు లేకపోయినా – సోమరితనం లేకుంటే విజయం మీదే.

**శ్రీహరిః**

## సత్సంగంలోని సాధువచనాలు

1. మానవులు తమ జీవన కాలాన్ని అమూల్యంగానూ క్షణికంగానూ కూడ భావించి సమయాన్ని ఉత్తమోత్తమ కార్యములలో లగ్నంచేయాలి. క్షణకాలాన్ని కూడ వ్యర్థం చేయరాదు.



# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

**మూలం : స్వామిఓంకార్** **అనువాదం : బొప్పన అరుణాదేవి**

(గత సంచిక తరువాయి) **అధ్యాయం - 62**

## శాంతి ప్రచారము

భగవంతుని అనంతమయిన దయ, జ్ఞానము వలన మా ఆశ్రమానికి 'పీస్‌వాన్' అందులో మైక్రోఫోన్, లౌడ్ స్పీకర్, దానితోపాటుగా సంచార వైద్యశాల సమకూర్చాడు. దానివలన మేము శాంతి సందేశాలను ప్రేమను, ఆరోగ్యం పరిరక్షణ కోసం మందులను గ్రామగ్రామాలకు, పట్టణాలకు సంచారము చేస్తూ అందరికి అందించగల్గుతున్నాము. అలాగే స్నేహితులకు, శాంతి ఆశ్రమ భక్తులకు కూడా సేవలందుతున్నాయి.

ఇప్పుడు మాకు నీలగిరి కొండల్లో కూడా ఒక శాంతి కేంద్రము ఏర్పడింది. కనుక అక్కడి సభ్యులు, స్నేహతుల ఆహ్వానం, కోరిక మేరకు స్వామీజీ ఆశ్రమాన్ని వదిలి ఏప్రిల్ మొదటి వారములో 1958వ సంవత్సరంలో మా పీస్ వ్యాన్‌లో కొద్దిమంది ఆశ్రమభక్తులు, పనివారితో కలిసి ప్రయాణం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అందువలన ఎవరయినా ఆశ్రమ భక్తులు, స్నేహితులు దక్షిణ ప్రాంతానికి వెళ్ళే దారిలో నివసించేవారు స్వామీజీని మరియు వారితో ఉన్నవారిని ఆహ్వానించి ఆధ్యాత్మిక కేంద్రంలో సత్సంగాలు ఏర్పాటు చేసుకోవాలని తలంపు వస్తే ఆశ్రమానికి ముందుగా తెలియచేయవలసిందిగా అప్పుడు ఆయా కార్యక్రమాలు ఏర్పాటు చేసు కోవడానికి అవకాశం కల్పించబడుతుంది అని ప్రకటన చేయబడింది.

మన స్వామీజీ పూర్తిగా విశ్వసిస్తారు. వ్యక్తిగత శాంతి విశ్వశాంతికి బాటలు వేస్తుందని, అందువలన ఆయన ప్రతి వ్యక్తి హృదయంలో శాంతిని నెలకొల్పాలని వారి గృహాలను శాంతిమయం చేయాలని, అందుకోసం విశ్వశాంతి ప్రార్థనని పదే పదే మననం చేయించాలని, దానివలన వారు భగవంతుని దివ్యానుభూతిని పొందుతారని సంకల్పించారు. స్వామీజీ ఆశయం ఏమిటంటే భక్తులకు వారి గృహాలను పూజామందిరాలుగా భూమి మీద స్వర్గలోకం లాగా మార్చివేయాలని, అందుకు వారికి సహాయ సహకారాలు అందించాలని అనుకుంటారు.

"నిన్నటి పూమొగ్గలు ఈ రోజు వికసించిన పుష్పాలు" అన్న మాటల్లో ఎంతో సత్యముంది. స్వామీజీ ఆరు సంవత్సరాలు మౌనంగా గడిపినప్పుడు తీవ్రంగా ఆలోచించి చెప్పిన మాటలు.

ఎప్పుడయినా మీ మౌనాన్ని వీడి మాట్లాడటం మొదలుపెడితే మీరు అప్పుడు ఏమి చేస్తారు? అప్పుడు మీ కోరిక లేదా సంకల్పం ఏమిటి?

“అప్పుడు నేను శాంతి ప్రార్థనని ప్రచారము చేయడానికి ఆత్రుత పడతాను. అది నిజంగా ఒక గొప్ప శక్తిని ప్రసాదించే తాయెత్తు లాంటిది. చాలామంది తూర్పు పడమర దేశాల్లోని శాంతి ఆశ్రమ భక్తులకు ఒక హృదయం నుండి మరొక హృదయానికి, గ్రామాల్లో, పట్టణాల్లో, ప్రపంచమంతటా ప్రచారము చేయాలని ఉంది. **ప్రపంచమంతా నా సొంత ఇల్లు లాంటిది. అందులో నివసించే ప్రజలందరూ మనకు సోదర సోదరీమణుల వంటి వారు. వాళ్ళకి సేవ చేయటమే మన నిజమయిన మతము.”**

ఆ విధంగా స్వామీజీ మౌనంగా ఉపవాస దీక్షలో ఉన్న సమయంలో ఏదయితే సంకల్పం చేశారో అదేవిధంగా వారు ప్రేమ, శాంతి బీజాలను దగ్గరివారికి, దూరంలో ఉన్నవారి హృదయాల్లో, భక్తుల హృదయాల్లో నాటుతున్నారు.

విజ్ఞులయిన పెద్దలు ఈ ప్రపంచంలో రెండు రకాల వ్యక్తులుంటారని చెపుతారు. భౌతికంగా మరణించినా శాశ్వతంగా ఈ ప్రపంచంలో జీవించి ఉండేవారు ఒకరయితే, ఇక రెండవవారు కేవలం భౌతికంగా జీవించి ఉంటారు కానీ ఆధ్యాత్మికంగా వారు మరణించిన వారితో సమానము.

జీవించి ఉండగా, సుశీలాదేవి కేవలము మంచి పనులు చేయటానికే బ్రతికింది. భగవంతుని బిడ్డలందరికీ హృదయాల్లో ప్రేమ, శాంతి బీజాలను నాటింది. ఆమె భౌతికంగా జీవించి లేకపోయినా ఇప్పుడు 'పీస్ వ్యాన్' ద్వారా మంచి పనులు చేయడానికి దోహదపడుతోంది. మానవుడు సృష్టించుకున్న జాతి మత భేదాలు లేకుండా రంగు, రూపు, దేశము, ప్రాంతము తేడా లేకుండా దేవుని బిడ్డలందరికి సేవలు అందించగల్గుతున్నాము. ఈ 'పీస్ వ్యాన్' సుశీలాదేవి ఇచ్చిన ప్రత్యేకమయిన కానుక. అందువలన సహజంగానే మేము దానికి 'సుశీలా పీస్ వ్యాన్' అని పేరు పెట్టాము.

ఆమె జీవితంలో అమూల్యమయిన ఇరవై అయిదు సంవత్సరాల కాలాన్ని ఆశ్రమ సేవలకి అంకితం చేసింది. ఆమె ఆశ్రమానికి ఎన్నో కానుకలు అందించింది. అవన్నీ ఆమె హృదయానికి అత్యంత ఆత్మీయమైనవి. వాల్తేరు ఆశ్రమంలో సుశీలా కుటీరం ఉంది. తోటపల్లి ఆశ్రమంలో సుశీలా మందిరం గత నలభైరోజుల్లో రూపుదిద్దుకుంది. ఇప్పుడు ఆ మందిరంలో విదేశాల నుండి వచ్చిన అతిథులు,



స్నేహితులు ఎంతో సౌకర్యంగా బస చేస్తున్నారు. ఇక ఆమె చివరి కానుక ఈప్రపంచాన్ని వదిలిపెట్టే ముందు ఆశ్రమానికి ఇచ్చినది ఈ 'పీస్ వ్యాన్'.

అందువలన ఆమె గౌరవపూర్వకమైన జ్ఞాపకాలతో మేము మా ప్రయాణాన్ని పీస్‌వ్యాన్‌లో జూన్ 8వ తేది 1958లో కోటగిరి నీలగిరి కొండల్లో నెలకొని ఉన్న కేంద్రానికి మొత్తం పన్నెండు మందిమి బయలుదేరాము. వారిలో సంగీతము నేర్పించే గురువు, ఇంకా ఆరుగురు విద్యార్థులు కూడా ఉన్నారు. మేము దాదాపు వేయి మైళ్ళ దూరం ప్రయాణించాము. భగవంతుని అనుగ్రహముతో దారి పొడగునా అనేకమంది భక్తుల హృదయాల్లో శాంతి బీజాలు నాటాము.

ప్రపంచములోని సంపద అంతా నాకే చెందుతుంది. మనమందరము భగవంతుని చేతిలో ఉన్నాము. అందువలన దైవకార్యాలను దైవమే ఎవరో ఒకరి ద్వారా, ఏదో ఒక మార్గంలో చేయించుకుంటాడు. మా ప్రయాణంలో మేము ఇరవై రెండు బహిరంగ సమావేశాలు, ముప్పై నాలుగు గృహాల్లో సత్సంగాలు నిర్వహించాము. దాదాపు నాలుగువేల రూపాయలు వివిధ ఆశ్రమ కార్యక్రమాల నిమిత్తమై ఖర్చు చేశాము. పెదపూడి అనే గ్రామంలోని భక్త కుటుంబం వారు వారి బిడ్డ అయిన చంద్రశేఖర్‌ను ఆశ్రమ గురుకులానికి ఇచ్చారు. మా ప్రయాణంలో ఎవరు ఆయనకు పూలదండ వేసినా ఆయన దానిని 'పీస్‌వ్యాన్'కి వేసేవారు. సుశీలాదేవికి ఆ దండను వేస్తున్నట్లుగా ఆయన చెప్పారు.

**ఓం... ఓం... ఓం...**

## ఓంకార సూక్తులు

- నీకు దైవమునందు నిజముగా నమ్మికయున్నదా? దైవము యొక్క సర్వజ్ఞత్వము నందును, సర్వవ్యాపకత్వము నందును, సర్వ శక్తిత్వమునందును నీకు పరిపూర్ణ విశ్వాసమున్న యెడల సర్వత్రా ఆ దైవము నేల కాంచజాలవు? మనో వాక్కర్మలచే ఆ దివ్యత్వము నేల ప్రదర్శింపవు?
- అన్నదానము గొప్పదే అయినను దానివలన కలుగు ఫలితము తాత్కాలికమే. కానీ జ్ఞానదానము శాశ్వతమైన ఫలితాన్నిస్తుంది. రోగపీడితునికి పడకను, ఔషధమును, అలసట చెందినవానికి ఆసనమును, దాహముగొన్నవానికి మంచి తీర్థమును, ఆకలిగొన్నవానికి ఆహారమును ఇమ్ము. అతిథులను గౌరవించి ఆహారమును ఇమ్ము. ఋణమునకు దూరముగా ఉండుము.

# ఆనంద రామాయణము

(గత సంచిక తరువాయి) **పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

## 4వ సర్గ (వృందాశాప వృత్తాంతము)

అహమేవ గమిష్యామి యోద్ధుం రక్షస్వ వాహినీమ్ ।
తత్తాతవచనం శ్రుత్వా రామస్తం పునరబ్రవీత్ ॥ 27

యదా మే కుంఠితాం శక్తి పశ్యసి త్వం రణాంగణే ।
తదా మే కురు సాహాయ్యం తావదత్ర స్థిరోభవ ॥ 28

స్వాం వాహినీం సకుటుంబాం తాత త్వం రక్ష మద్గిరా ।
ఇత్యుక్త్వా పితరమ్ నత్వా సజ్జీకృత్య శరాసనమ్ ॥ 29

జగామ రథమారూఢో లక్ష్మణోపితమన్వగాత్ ।
తౌదృష్ట్వాభరశ్చాథ శత్రుఘ్నోఽపి జగామ సః ॥ 30

తాన్దృష్ట్వా దశసాహస్రీం రాజసేనామచోదయత్ ।
తతస్తే పార్థివాః సర్వే రథస్థం తం రఘూత్తమమ్ ॥ 31

నిరీక్ష్య దర్శయామాసుః స్వసేనాయాం పరస్పరమ్ ।
సమాగతోఽయం శ్రీరామః స్వపితృస్యందనంస్థితః ॥ 32

ఏష వై సుమహత్ శ్రీమాన్ విటపీ సంప్రకాశతే ।
విరాజత్యుజ్జ్వలస్కంధః కోవిదారధ్వజో రథే ॥ 33

దశరథాజ్ఞయా తస్య రథే శస్త్రౌఘపూరితే ।
ధ్వజబద్ధపతాకోచ్చకోవిదారే స్థితఃస్వయమ్ ॥ 34

ఏవం వదంతస్తే సర్వే రథైర్యోద్ధుం సమాయయుః ।
తతోఽభవన్మహద్యుద్ధం ఘోర తచ్చ పరస్పరమ్ ॥ 35

అస్త్రైః శస్త్రైః భిందిపాలైః శతఘ్నీభిః పరశ్వథైః ।
రామస్య సైనికాన్ ముక్త్వా రాజానో రామమన్వయుః ॥ 36

తే వవర్షుర్మహాశస్త్రైః బాణైర్వ్యాప్య దిగంబరమ్ ।
తాన్దృష్ట్వా నృపతీన్ సర్వాన్ రామమేవాభిసంముఖాన్ ॥ 37

లక్ష్మణః ప్రాద్రవచ్ఛీఘ్రం భరతోఽపి చ శత్రుహా ।
స్వామితారకవద్ఘోరం ఆసీద్యుద్ధం సుదారుణమ్ ॥ 38

తతో నృపతయః సర్వే శస్త్రౌఘైః భరతం తదా ।
తే విధ్వా మూర్ఛితం చక్రుః స్యందనాత్పతితో భువి ॥ 39



భరతం పతితం దృష్ట్వా శత్రుఘ్నం వివ్యధుః శరైః।
తం చాపి విరథం కృత్వా దుద్రువుర్లక్ష్మణం నృపాః ॥ 40

వవర్షుర్నిశితైర్బాణైః చక్రుస్తం వ్యాకులం రణే ।
తథైవ రాఘవం చాపి శరైరాచ్ఛాదయన్నృపాః ॥ 41

తతః శ్రీరామచంద్రోఽపి లీలయా సమరాంగణే ।
పశ్యత్సు జాలరంధ్రైశ్చ కౌసల్యాద్యాసు మాతృషు ॥ 42

సీతయా భ్రాతృపత్నీషు పిత్రా మంత్రికులేష్వపి ।
టణత్కృత్య మహచ్చాప వాయవ్యాస్త్రేణ తాన్ నృపాన్ ॥ 43

శుష్కపర్ణవదుద్ధూయ ప్రాక్షిపదబ్ధిరోధసి ।
మోహనాస్త్రేణ శేషాన్ హి మోహయామాస రాఘవః ॥ 44

అందుకు మరల రాముడు, "నేను రణమున శక్తిహీనుడయినపుడు నీవు సహాయము చేయుదువులే, అంతవరకు ఇచ్చటనే స్థిరుడైయుండుము. నామాట విని సకుటుంబ సైన్యములను బ్రోచుచుండుము," అని చెప్పి, తండ్రికి నమస్కరించి, ధనస్సును సంధించి, రథారూఢుడై వెడలెను. లక్ష్మణుడు అనుసరించెను. వారిని జూచి, భరత శత్రుఘ్నులును వెడలిరి. వారిని జూచి, పదివేల సైన్యమును పంపించెను. పిదప రాజులందరును రథమునెక్కిన రాముని జూచి, తమలోతాము, "వచ్చుచున్న శ్రీరాముడు తన తండ్రి రథమునెక్కియున్నాడు. ఇతడు గదా గొప్ప సంపద్వృక్షము వలే ప్రకాశించుచున్నాడు. ఉజ్జ్వల స్కందమును, కోవిదారధ్వజమును రథమున గల్గియున్నది. దశరథాజ్ఞచే ఇట్లు వచ్చుచుండును," అని యిట్లు పలుకుచు, వారందరును రథములతోడ రణమునకు వచ్చిరి. అంత అన్యోన్యముగా భయంకరమైన మహాయుద్ధము జరిగినది. శస్త్ర, అస్త్రాదులతో రామసైనికులను పడమొత్తి, రాజులందరును రామునిమీద కలబడిరి. ఇట్లు బాణవర్షములు గగనమును దిక్కులను వెంబడించగా, వారితో తారసిల్లెను. ఆ యుద్ధము కుమారస్వామి తారకాసుర యుద్ధమువలే మిక్కిలి భయంకరముగా ఉండెను. అపుడు రాజులందరును శస్త్రౌఘములచే భరత శత్రుఘ్నులను మూర్ఛితులను జేసిరి. వారు నేలకూలిరి. అందుచే లక్ష్మణుడు కోపముతో విజృంభించి బాణవర్షమును కురిపించుచు వచ్చెను. అతని చాలకపోయెను. అపుడు గవాచీల నుండి కౌసల్యాది మాతలు, సీతాది రాజపత్నులు, మంత్రులందరును చూచుచుండగా, శ్రీరామచంద్రుడు రణాంగణమున వినోదముతో వాయవ్య అస్త్రప్రయోగముచేసి, రాజులందరిని ఎండు టాకులవలే సముద్రతీరమును ఎగురగొట్టెను. తక్కిన వారినందరిని మోహనాస్త్ర ప్రయోగముచే మూర్ఛితులను జేసెను. (44)

లులుంఠ సకలం సైన్యం హస్త్యశ్వరథసంకులమ్ ।
తతో మూర్ఛితమాలోక్య భరతం కైకయీ రణే ॥ 45

కరిణ్యాః శీఘ్రముత్ప్లుత్య శుశోచాంకే నిధాయ తమ్ ।
తతో దశరతశ్చాపి కౌసల్యాద్యా నృపస్త్రియః ॥ 46

సాంత్వయిత్వాఽథ తాన్ రామః సౌమిత్రిం ప్రాహ వేగతః ।
ఇతో విదూరే సౌమిత్రే ముద్గలస్య తపోనిధేః ॥ 47

ఆశ్రమోఽస్తి తత్ర త్వం గత్వా వల్లీః శుభావహాః ।
సంజీవన్యాదికాః సర్వాః శీఘ్రమానయ లక్ష్మణ ॥ 48

మునేస్తపః ప్రభావేణ బహవః సంతి తత్ర వై ।
తథేతి లక్ష్మణో గత్వా స్యందనస్థస్త్వరాన్వితః ॥ 49

అవరుహ్యరథాద్వీరః సంవివేశాశ్రమం మునేః ।
నివారితః స వటుకైః సమాధివిరమే మునేః ॥ 50

యాచాం కృత్వా శుభా వల్లీః ప్రాప్స్యసే త్వం న చాన్యథా ।
కాలాతిక్రమభీత్యా స లక్ష్మణోఽపి రఘూత్తమమ్ ॥ 51

వృత్తం నివేదయామాస పునస్తం రాఘవోఽబ్రవీత్ ।
నివారయిత్వా వటుకాన్ వినా శస్త్రైస్త్వరాన్వితః ॥ 52

### శ్రీరాముడు భరతశత్రుఘ్నులను సంజీవనిచే బ్రతికించుట

ఇట్లు సమస్త సైన్యము రామరణక్రీడచే నిశ్శేషమయినపుడు, కైకేయి గజము నుండి దిగి, భరతునెత్తుకుని, ఒడిలో నుంచుకుని దుఃఖింపసాగెను. దశరథుడును, కౌసల్యాదులును చింతాక్రాంతులై రోదించసాగిరి. రాముడు వారిని సమాధాన పరచుచు లక్ష్మణునితో, "ఓ లక్ష్మణా! ఇచ్చట సమీపమున ముద్గలాశ్రమమున సంజీవిని మొదలగు మహౌషధులు ఆ ముని ప్రభావముచే రాజిలుచున్నవి. వేగమే పోయి వాటిని తీసుకుని రమ్ము," అని యాజ్ఞాపించెను. వెంటనే లక్ష్మణుడును రథము నుండి దిగి, ఆశ్రమమునకు పోయి, అచ్చటి వటువులు, "మునులవారు సమాధినిష్ఠనుండి బహిర్ముఖులైన పిదప వారిని యాచించి, తీసుకొని పోవచ్చు," నని నివారింపగా, వచ్చి, ఆ సంగతిని రామసన్నిధిలో తెలియజేసెను. అందుకు రాముడు, "వారి భయము వలదు, త్వరగా వెడలి, శస్త్రములేక యా బ్రహ్మచారులను నిగ్రహించి, మహౌషధులను తీసుకొనిరమ్ము," అని పంపెను. సౌమిత్రి వేగముగా వెళ్ళి, బలవంతముగా ప్రాణాధార మూలికలను తెచ్చెను. శ్రీరాముడు వాటిచే, భరత శత్రుఘ్నులను బ్రతికించి, కైకేయి, దశరథ రాజునకును ఆనందమును కలిగించెను. అప్పుడు కైకేయీ దశరథులు శ్రీరామాదులను తమ హృదయాలకు హత్తుకుని యానందించుచు, వశిష్ఠులచే బ్రాహ్మణులతోడ అనేక రక్షాశుభ కర్మోత్సవములను చేయించెను (52).



## స్వామి రామదాసు చెప్పిన కథలు
## అవధి లేని అమ్మ ఔదార్యం

మాతా కృష్ణాబాయి జీవితం త్యాగమయం. ఆత్మజ్ఞానియైన ఆమె, నిత్యజీవితంలో అందరిలో అంతటా భగవంతుని చూడగల్గేది. అందుచేత అందరియెడ అపార ప్రేమా సమానత్వం చూపకల్గేది. ఈ క్రింది కథ ఆమెను గురించినది.

ఒకరోజు ఆనందాశ్రమం దగ్గరలోనే కాపురముంటున్న బీదవాడొకడు 'మాతాజీ కావాలి' అని చూడ్డానికి వచ్చాడు.

"అమ్మా! నా భార్యాబిడ్డలకి తిండిలేక ఆకలితో అల్లాడిపోతూవున్నారు. నాకు సంపాదన గాని, యితర ఆధారం గాని యేమీ లేదు. మీరు సాయం చేస్తారని" వచ్చానని మాతాజీతో మొరపెట్టుకున్నాడు.

మాతాజీ కొంచెంసేపు ఆలోచించి "పాలిచ్చే ఆవును దూడతో పాటు యిస్తాను. పాలు అమ్ముకొని సంసారం గడుపుకోవచ్చును గదా! సరేనా!" అన్నారు.

"మీరు చెప్పే విషయం బాగుందమ్మా! నేను వుంటూన్న పాక స్థలం నాదికాదు. వేరేవాళ్ళ స్థలంలో వేసుకున్నాను. ఆవూదూడా తీసుకుపోయి కట్టడానికి ఇంకొకపాక యేదిలేదే? వెంటనే మాతాజీ "దీనిలో కష్టమేముంది? మా పనివాళ్ళను పంపి ఆవూ దూడా వుండడానికి పాక వేయిస్తాను. వాటిని అందులో కట్టవచ్చును" అన్నారు.

మీరు అన్నది చక్కగానే వుంది. కాని ఆవుకు గడ్డి తెలగపిండికి నాకెక్కడ నుంచి డబ్బు వస్తుంది తల్లీ" అన్నాడతను.

"ఇదీ పెద్ద సమస్య కాదు, మా దగ్గర కావల్సినంత గడ్డి వుంది. మూడు, నాలుగు మోపులు వేయిస్తాను. మా వాడకం కొట్టు ఆసామీతో నీకు కావలసిన తెలగపిండి ఈయమని చెపుతాను" అన్నది మాతాజీ.

వారంరోజుల్లో దూళ్ళశాల వేయడం, గడ్డీ తెలగపిండి పంపగం అన్నీ జరిగాయి. మళ్ళీ కొద్దిరోజులకే అతను 'అమ్మా' అంటూ తిరిగి వచ్చాడు. "ఆవు పాలు బాగా యిస్తూ వుంది, వాటికి మంచిధర ఇచ్చి కొనుక్కునే వాళ్ళు లేక కుటుంబం గడవడం కష్టంగా వుంది" అని మొరపెట్టాడు.

"దీనికి బెంగ ఎందుకు? మేము ఆశ్రమానికి ఎలాగూ పాలు కొనుక్కుంటాము. ఆ పాలేవో యిక్కడే యిస్తే ఖరీదు యిస్తాము. నీ బెంగ తీరిపోతుంది" అని మాతాజీ సమాధాన పరచారతన్ని.

ఆ రోజు నుంచీ ఆసామీ ఆనందానికి అంతులేదు. ఔదార్యమన్నా సాటిలేని దానమన్నా యిదే!

నిన్ను నీవే భగవంతుని కరకమలములందు సమర్పించుకొనుము. అప్పుడు నీ బ్రతుకెంత శోభలో ప్రకాశించునో కనుగొనుము.

# ఏకజీవ వాదము - దృష్టి-సృష్టి వాదము

**(జూన్ సంచిక తరువాయి)** **-స్వామి బోధాత్మానంద సరస్వతి**

**ప్రవచనం - 2**

ఇదివరకు చర్చించిన అంశానికి అనుబంధంగా ఈ విషయాన్ని కొన సాగిస్తున్నాము.

**పూర్వపక్షము:-** "ఈ ప్రపంచంలో సాధారణంగా మనము కార్య కారణ సంబంధాన్ని చూస్తున్నాము. కార్య-కారణ సంబంధం అనేది ఉంది. దృష్టి-సృష్టి వాదములో కార్య-కారణ సంబంధమును ఎలా వివరిస్తారు?" (సిద్ధాంతి పక్షము) ఎందుకు? (సి.ప) సాధ్యం కానిది ఏమిటి? వాదన ఇది-ఎల్లప్పుడూ కార్యము కంటే ముందు కారణము ఉండాలి. కారణమనేది కార్యం యొక్క నియతపూర్వ వృత్తి. కార్యము ఏర్పడటానికి ముందే కారణము స్థిరంగా ఉండాలి. దానినే కారణము అంటారు. మట్టి ముందుగా ఉండాలి ఆ తరువాతనే కుండ ఏర్పడుతుంది. ఈ కార్య- కారణ సంబంధాన్ని ఎలా వివరిస్తారు? ఈ ప్రశ్నను కూడా రెండు రకాలుగా విభజించవచ్చును. 1.భౌతిక వస్తువులకు సంబంధించి నంతవరకు కార్య-కారణ సంబంధం. 2. పదాల ద్వారా అందించబడిన జ్ఞానము రూపములో-శబ్ద ప్రమాణము. దీనిని మేము నిదానంగా వివరిస్తామని సిద్ధాంతి చెబుతున్నారు. వేదాంతములో దృష్టి-సృష్టి వాదమునకు వచ్చేసరికి కార్య-కారణ సంబంధం అనేది అంగీకరించబడిన ఉపదేశము. ఉదా: ఒకవేళ నేను నా దృష్టి-సృష్టిలో మట్టిని చూస్తున్నాను. అలాగే కుండను కూడా చూస్తున్నాను. దృష్టి-సృష్టిలో ఉపదేశము ఇవ్వమని ఒకరడుగుతున్నారు. ఉపదేశము: ఈ వస్తువు కారణము, మరొకటి కార్యము, మట్టి కారణము, కుండ కార్యము. నేను అర్థం చేసుకున్నాను. కుండ ఉత్పత్తికి సంబంధించినంత వరకు ఇది తెలుస్తుంది. అయితే వ్యవహారములో కుండ ఉత్పత్తికి మట్టి అవసరము అనే జ్ఞానం ఉంది. వస్త్రము ఉత్పత్తి చేయడానికి దారము అవసరము అనే జ్ఞానం ఉంది. వ్యవహారము కొనసాగుతుంది. కేవలం దృష్టి-సృష్టి ఉన్నంత మాత్రమున కార్య-కారణ నిషేధము జరగడము లేదు. కానీ రెండూ కూడా ఏకకాలంలో వ్యక్తమవుతున్నాయి అని ఎవరైనా అంటే, ఏకకాలంలో వ్యక్తమయ్యే రెండింటి మధ్య కార్య-కారణ సంబంధం ఉండవచ్చు. స్వప్నంలో వలె, నేను తండ్రిని, పుత్రుడిని ఇద్దరిని కలిపి చూస్తున్నాను. వాళ్ళిద్దరి మధ్య కార్య-కారణ సంబంధం ఉంది. జాగ్రత్‌లో కూడా అదే వాస్తవం. కార్య-కారణానికి



సంబంధించినంత వరకు వేదాలలో వ్యక్తము చేసినటువంటి పూర్వ మీమాంసము. మరియు ఉత్తర మీమాంసము వీటిని దేనిలాగా (కార్యము/కారణము) పరిగణించాలి? వేదాలలో జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత అని తెలిపారు. స్వర్గము నా గమ్యము. ఇది నా లక్ష్యము. జ్యోతిష్టోమయాగ కారణము, ఎందుకనగా అదే నా లక్ష్యము. ఒకవేళ నేను జ్యోతిష్టోమము చేస్తే స్వర్గమును పొందుతాను. ఈ ఉపదేశ వాక్యము దృష్టి-సృష్టి వాదములో కూడా సత్యము. అలాగే దృష్టి-సృష్టి వాదములో ఆ కర్మ కూడా దృష్టి-సృష్టి. నీవు అనుభవం పొందుతున్నప్పుడు అది ఉంటుంది. స్వర్గము కూడా అంతే. జ్యోతిష్టోమము ద్వారా పొందిన స్వర్గము దృష్టి-సృష్టి. ఉత్తర మీమాంసములో సమాధి సహిత శ్రవణాది శమ, దమ మొ., అన్ని అర్హతలు వీటితోపాటు నేను ఎప్పుడైతే శ్రవణం మననం చేస్తానో అప్పుడు మోక్షం పొందుతాను. సమాధి సహిత శ్రవణాది అనేవి సాధనలు మరియు మోక్ష అనేది నా యొక్క సాధ్యము, ఈ రెండింటి మధ్య కార్య-కారణ సంబంధం ఉంది. ఇది అంగీకరించబడింది. ఇది కూడా వేదాలలో ఇచ్చినటువంటి ఉపదేశము ద్వారా తెలియబడినది. దృష్టి-సృష్టి వాదములో ప్రతీది దృష్టి-సృష్టి యే, ఉపదేశము మరియు ఉపదేశము చేసేవారు ఇద్దరు దృష్టి-సృష్టి, శిష్యుడు మరియు అతని జ్ఞానము దృష్టి-సృష్టి మరియు ఫలితము అది స్వర్గమైనా కానీ, ముక్తి అయినా కానీ దృష్టి-సృష్టి, దానిని వివరించవచ్చు.

ఇంకొక అంశమును చర్చిద్దాము. వేదాంతి చెబుతున్నారు ఏదైనా అధ్యాస ఏర్పడటానికి 'అధ్యాస యొక్క తటస్థ లక్షణము ఉంటుంది మరియు అధ్యాస యొక్క స్వరూప లక్షణము ఉంటుంది'. తటస్థ లక్షణము అనగా అధ్యాస యొక్క ముఖ్యమైన భాగము కాదు. కానీ దాని ద్వారా అధ్యాస తెలుస్తుంది. అధ్యాస అనగా ఏమిటి అని తెలుసుకోవడానికి స్వరూప లక్షణము అధ్యాస యొక్క ముఖ్యమైన భాగము.

**అధ్యాస యొక్క తటస్థ లక్షణము:** తటస్థ లక్షణము త్రితయము (మూడు). 1. ఇంద్రియాలు మరియు అధిష్ఠానము మధ్య సంపర్కం. 2. సంస్కారములు లేదా నేను పోగు చేసుకున్నటువంటి వాసనలు. దేని గురించి? సులభంగా అర్థమవడానికి ఉదాహరణను తీసుకుందాము. తాడు-పాము (రజ్జు-సర్ప) అధ్యాస ఏర్పడాలి అంటే నేను ఇదం అంశమును చూడాలి. 'ఇదం' (ఇది) అంశ. నేను ఎప్పుడైతే 'ఇది పాము' అని అంటున్నానో 'ఇది' అనే అంశం తెలియాలి. దీనిని ఇంద్రియాలు మరియు అధిష్ఠానము (తాడు) యొక్క సంపర్కము ద్వారా తెలుస్తుంది.

కానీ తాడు తాడుగా తెలియడంలేదు, తాడు పాముగా తెలుస్తుంది. కానీ ఈ 'ఇది' (ఇదం) అంశము తెలుస్తుంది. ఇది ఒకటి.

రెండవది నాకు పాము యొక్క సంస్కారము ఉండవలెను, అప్పుడే పాము అధ్యాస ఏర్పడుతుంది. ఒకవేళ ఇంతకుముందు నేను పామును ఎప్పుడూ చూసి ఉండకపోతే ఎలా చూస్తాను? మూడవది కొంత దోషమనేది ఉండాలి. ఒకవేళ వెలుతురు ఎక్కువగా ఉంది అనుకోండి నేను తాడును పాముగా చూడను. నేను తప్పు చేయను. పూర్తిగా చీకటిగా ఉన్నప్పుడు కూడా తప్పుచేయను. అందువలన కొంత దోషమనేది ఉండాలి, నా నేత్రములలో దోషము, చాలా చాలా తక్కువ కాంతి ఉంది, మరియు నా హృదయములో భయం ఉంది. వీటన్నింటిని కలిపి నేను పామును సృష్టిస్తున్నాను. ఈ మూడు అంశములు తటస్థ లక్షణము. ఇంద్రియములు అధిష్ఠానముతో సంపర్కము చెందడం, అధ్యస్థము యొక్క సంస్కారము మరియు దోషము (అధ్యాస ఏర్పడటానికి గల కారణము) ఈ మూడు అధ్యాస యొక్క తటస్థ లక్షణము.

మరొకటి అధ్యాస యొక్క స్వరూప లక్షణము-ఇది సత్యము మరియు మిథ్యా మధ్య కలయిక ద్వారా ఏర్పడుతుంది. 'సత్యానృతే మిథునీకృత్య' అని భాష్యకార అధ్యాస భాష్యలో అన్నారు, అధ్యాస ఏర్పడాలి అంటే సత్య మరియు మిథ్యా రెండింటి కలయిక ఏర్పడాలి.

**పూర్వ పక్షము:** ఇది దృష్టి-సృష్టి వాదములో ఎలా వివరిస్తారు?

ఈ అంశమును గురించి ఎవరైతే ఆలోచిస్తున్నారో వారికి అధ్యాస భాష్యకు సంబంధించిన అవగాహన ఉంది అని మేము పరిగణిస్తున్నాము. దాని సహాయముతో ఇప్పుడు మనము విచారణ చేస్తున్నాము. తటస్థ లక్షణము మరియు స్వరూప లక్షణము అవసరము.

**సిద్ధాంతి:** స్వరూప లక్షణము దృష్టి-సృష్టి వాదములో కూడా ఉంది. భేదమనేది లేదు ఎందుకనగా సత్యము ఉంది. ఘటము యొక్క సత్తు అంశంలో ఎటువంటి మార్పు లేదు, మార్పులేనటువంటిది సత్తు, నామరూపము మిథ్యా అని ఇంతకు ముందు మేము వివరించాము. అయితే ప్రతీసారి నేను వస్తువును అనుభవిస్తున్నప్పుడు సత్యానృతే మిథునీకృత్య ఉంటుంది. ఎందుకనగా దృష్టి-సృష్టి వాదములో మొత్తం ప్రపంచం అధ్యాస. సృష్టి అంతా అధ్యాస, సత్య అంశం మరియు మిథ్యా అంశం.



ఒక ముఖ్యమైన అంశమును మనం గుర్తించాలి. తాడు యందు పామును చూసినప్పుడు అధిష్ఠానం ఏమిటి? ఇటువంటి ప్రశ్న వేసినప్పుడు సులభమైన సమాధానం- అధిష్ఠానం తాడు, అధ్యస్థ పాము. ఒకవేళ నేను ఆల్చిప్పయందు వెండిని చూసినప్పుడు అధిష్ఠానం ఏమిటి? అధిష్ఠానం ఆల్చిప్ప, అధ్యస్థము ఏమిటి? వెండి. కానీ ఇది నిర్దిష్టమైన సమాధానం కాదు. కానీ పాము తాడుయందు అధ్యస్తము కాలేదు, పాము తాడు అవిచ్ఛిన్న చైతన్యము యందు అధ్యస్తము అయింది. తాడు అవిచ్ఛిన్న చైతన్యము యందు పాము భ్రాంతి ఏర్పడుతుంది. ఆల్చిప్ప అవిచ్ఛిన్న చైతన్యము యందు వెండి భ్రాంతి ఏర్పడుతుంది. అందువలన ఆ వస్తువుతో పాటు చైతన్యము కూడా ఉంది. ఆ చైతన్యములో మాత్రమే మొత్తం బ్రహ్మాండం, ఉత్పత్తి అంతా కూడా అనుభవమవుతుంది అని దృష్టి-సృష్టి వాదము చెబుతుంది. దృష్టి-సృష్టి వాదములోనైనా, సృష్టి-దృష్టి వాదములోనైనా మీరు చైతన్యము వదిలివేయలేరు. పాము తాడుయందు వ్యక్తమవుతుంది అని మీరు చెబుతూ ఉండొచ్చు, కానీ పాము ఎల్లప్పుడు తాడు ద్వారా అవిచ్ఛిన్నము కాబడిన చైతన్యము యందు వ్యక్తమవుతుంది. వేదాన్తులకు పాము ఎంత మిథ్యానో తాడు కూడా అంతే మిథ్యా, కేవలం బ్రహ్మ మాత్రమే సత్యం. ఒకవేళ మిథ్యా పాము తాడుయందు వ్యక్తమవుతుంది అని, ఆ తాడు కూడా మిథ్యానే అన్నప్పుడు సత్యం అనేది లేదు. సత్యానృతే మితునీకృత్యం అనగా చైతన్యములో పాము అధ్యస్తమవుతుంది, దృష్టి-సృష్టి వాదములో ప్రతీది చైతన్యములోనే వ్యక్తమవుతుంది. రెండు సోపానాల పద్ధతి అనేది లేదు. తాడులో పాము, చైతన్యములో తాడు. దృష్టి-సృష్టి వాదములో ప్రతీది చైతన్యములోనే వ్యక్తమవుతుంది. అందువలన ప్రతీది చైతన్యములోనే అధ్యస్తమవుతుంది. ఎవరైనా అడగవచ్చు- ఒక వస్తువు పాముగాను, ఒక వస్తువు వెండిగాను ఎందుకు వ్యక్తమవుతుంది? అక్కడ నీకు మరొక విధమైన అధిష్ఠానము అవసరము. ఈ ప్రశ్నకు సమాధానంగా అదే ప్రశ్నను మేము అడుగుతున్నాము. నీ స్వప్నంలో కొన్ని రకాల వస్తువులనే ఎందుకు చూస్తున్నావు. అన్నీ ఎందుకు చూడటం లేదు? లేదా అన్నీ వేరు వేరుగా ఎందుకు చూస్తున్నావు, అన్నీ ఒకటిగానే ఎందుకు చూడటం లేదు? ఎందుకనగా సంస్కారములు, వాసనలు ఉన్నాయి. ప్రతీ వ్యక్తీ వాసనలను కలిగి ఉన్నాడు, తటస్థ లక్షణము యొక్క మూడు షరతులలో మొదటిది వర్తిస్తుంది, ఎందుకనగా అధిష్ఠానము బ్రహ్మ, చైతన్యము నాకంటే వేరుగా లేదు అని గుర్తించబడుతుంది, కాకపోతే నాకు తెలియదు అంతే. కానీ అదే చైతన్యము అంతటా ఉంది, అది గుర్తించబడింది. సంస్కారాలు/వాసనలు అనేవి ఉండటం వలన వివిధ

రకాల వ్యక్తులకు వివిధ రకాల అనుభవాలున్నాయి. సంస్కారాల వలన వివిధ రకాలనేవి ఉన్నాయి. మరియు మూడవ దోషము- అవిద్యా దోషము, మరియు అవిద్యలోనే అనేక రకాలైన దోషాలు ఉండవచ్చు, కొన్ని సమస్యల వలన సాధారణ దోషాలు, విశేష దోషాలు అనేవి ఉండవచ్చు. సాధారణ దోషము ప్రతీ ఒక్కరిలో ఉంది, మొత్తం ప్రపంచం అంతా అధ్యాస. అందులో ప్రజలు తమ సొంత అయోమయాన్ని సృష్టిస్తారు. ఎక్కువ అధ్యాసలను కలుపుతారు. అప్పుడు మనము నేను కోల్పోయాను అంటాము. ఇది ఇలా జరుగుతుంది. అధ్యాస మీద అధ్యాస ఏర్పడుతుంది. అనేక పొరల అధ్యాసలో మనము సాధారణముగా జీవిస్తున్నాము. ఆలోచిస్తున్నాము. ఓ నేను చాలా తెలివైనవాడిని, అన్నీ చాలా స్పష్టంగా ఉన్నాయి.

ఈ అంశమును ఇంతవరకు ఉంచుదాము, ఈ అంశం పైన ఇంకా కొన్ని ఆలోచనలు ఉన్నాయి. కానీ ఈ అంశమును మీరు గుర్తుంచుకోండి. అవిచ్ఛిన్న చైతన్యము (చైతన్యము వివిధ వస్తువుల ద్వారా అవిచ్ఛిన్నమవుతుంది) నందు అధ్యాస అనేది ఏర్పడుతుంది.

## ప్రవర్తన

లోతుగా ఆలోచించుము. సక్రమముగా నిశ్చయించుము. జాగ్రత్తగా వర్తించుము. సత్యముగా మాట్లాడుము. యుక్తియుక్తముగా చరించుము. నేర్పుగా పనిచేయుము. మెల్లగా మాట్లాడుము. సవ్యముగా వ్యవహరించుము. విషయమును మెలికవేసి మాట్లాడకుము. మోసమును, కపటమును త్యజించుము.

## 2 – వ కథ

రావణాసురుని ప్రధానమంత్రి యొకనాడు రావణునితో "దేవరా తాము అణిమాద్యష్టసిద్ధులను స్వాధీనము చేసికొనియుండియు రామరూపమును దాల్చి సీతనేల వశపరచుకొనకుంటి" రని యడిగెను. అందులకు రావణుడు "ఓరీ యవివేకీ, ఏమంటివి? పరమపావనమగు శ్రీరామచంద్రుని దివ్యరూపము నొకసారి మనమున ధ్యానించినచో, రంభా తిలోత్తమా ద్యప్సరసలు గూడ వల్లకాటిలో నుండు పీనుగుల బూడిదకంటె హేయముగా దోపరా! అట్లుండ నొక మానవాంగనకై నాచిత్తము ఆసింపగల్గునా?" యని ప్రత్యుత్తర మిడెను.



# సర్వ వేదాంత సిద్ధాంత సారసంగ్రహం

**॥ఓం॥**

శ్రీమత్పూజ్యభగవత్పాదశంకరాచార్యవిరచితః
శఙ్కరప్రసాదినీటీకాసహితః (స్వామి బోధాత్మానంద సరస్వతి)

**ఓం నమో బ్రహ్మాదిభ్యో బ్రహ్మవిద్యాసంప్రదాయకర్తృభ్యో వంశర్షిభ్యో మహద్భ్యో నమో గురుభ్యః ।**
**సర్వోపప్లవరహితః ప్రజ్ఞానఘనః ప్రత్యగర్థో బ్రహ్మైవాఽహమస్మి।**
**బ్రహ్మైవాఽహమస్మి।**

(ఓం బ్రహ్మాదిభ్యః, బ్రహ్మవిద్యాసంప్రదాయకర్తృభ్యః, నమః వంశర్షిభ్యః, మహద్భ్యః, గురుభ్యః నమః । సర్వోపప్లవరహితః ప్రజ్ఞానఘనః ప్రత్యగర్థః బ్రహ్మైవాఽహమస్మి । బ్రహ్మైవాఽహమస్మి ।)

బ్రహ్మ మొదలైన వారికి, బ్రహ్మవిద్య యొక్క సంప్రదాయాన్ని అందించేవారికి మరియు స్వీకరించే వారికి నమస్కారములు. ఋషులయొక్క వంశమునకు, మహాత్ములకు గురువులకు నమస్కారములు. ఎటువంటి విఘ్నాలు లేని బ్రహ్మ, చైతన్యస్వరూప బ్రహ్మ, ప్రత్యగాత్మ బ్రాహ్మ స్వరూపము నేను అయి ఉన్నాను. ఆ బ్రహ్మను నేనే అయి ఉన్నాను.

**సర్వవేదాన్తసిద్ధాన్తసాంసఙ్గహరూపిణమ్ ।**
**నౌమీడ్యం దక్షిణామూర్తిం స్వాత్మనిష్ఠైకసిద్ధయే ॥**

(అహం) సర్వవేదాన్తసిద్ధాన్తసాంసఙ్గహరూపిణమ్, ఈడ్యమ్ , దక్షిణామూర్తిమ్ , స్వాత్మనిష్ఠైకసిద్ధయే, నౌమి।)

సర్వవేదాన్తసిద్ధాంతసారసంగ్రహరూపమైన(బ్రహ్మ) దక్షిణామూర్తికి స్వాత్మనిష్ఠసిద్ధి కలగడం కోసం నమస్కారం చేస్తున్నాను.

**భాష్యకారం సురేశఞ్చ వ్యాసమద్వైతసన్నిభమ్ ।**
**వన్దేఽహం చిన్మయానన్దం తేజోదివ్యమహర్నిశమ్ ॥**

(అహం , అహర్నిశమ్, అద్వైతసన్నిభమ్, వ్యాసమ్, భాష్యకారమ్ చ, సురేశమ్ (చ), చిన్మయానన్దమ్ (చ), తేజః (చ), దివ్యమ్ (చ), వన్దే ।)

అద్వైత సమానులైన భాష్యకారులు, సురేశ్వరాచార్యులు, వ్యాసభగవానులు చిన్మయానందులు, తేజోమయానందులు, దివ్యానందులవారికి నేను ఎల్లప్పుడూ నమస్కరిస్తున్నాను.

**పూర్ణః పీయూషభానుర్భవమరుతపనోద్దామతాపాకులానాం**

**ప్రౌఢాజ్ఞానాన్ధకారావృతవిషమపథభ్రామ్యతామంశుమాలీ ।**
**కల్పః శాఖీ యతీనాం విగతధనసుతాదీషణానాం సదా నః**
**పాయాచ్ఛ్రీపద్మపాదాదిమమునిసహితః శ్రీమదాచార్యవర్యః ॥**

(విగత–ధనసుతాది–ఈషణానామ్ (ప్రేప్సూనామ్), యతీనామ్ కల్పః శాఖీ, భవమరుతపన–ఉద్దామతాప–ఆకులానామ్ పూర్ణః పీయూషభానుః, ప్రౌఢ–అజ్ఞాన–అన్ధకార–ఆవృత–విషమపథ–భ్రామ్యతామ్ అంశుమాలీ, శ్రీపద్మపాద–ఆదిమ–ముని–సహితః శ్రీమదాచార్యవర్యః నః సదా పాయాత్ ।)

ధనము, సంతానము మొదలగువాటియందు కోరికను త్యజించినట్టి యతీశ్వరులకు కల్పవృక్షమువంటి వారు, ప్రౌఢ అజ్ఞాన అంధకారముతో ఆవృతమైన విషమ మార్గములో భ్రమితమైన వారికి సూర్యుడివంటివారు, తీవ్ర సంసార తాపమనెడు చండమార్తాండుడిచేత పీడంచబడుతున్న వారికి అమృతకరుడగు చంద్రుని వంటివారు, అట్టి భాష్యకారులు పద్మపాదులు మొదలగు మునిగణముతో నన్ను ఎల్లప్పుడూ రక్షించెదరు గాక!

**దృష్టాన్తో నైవ దృష్టస్త్రిభువనజఠరే సద్గురోర్జ్ఞానదాతుః**
**స్పర్శశ్చేత్తత్ర కల్ప్యః స నయతి యదహో స్వర్ణతామశ్మసారమ్ ।**
**న స్పర్శత్వం తథాపి శ్రితచరణయుగే సద్గురుః స్వీయశిష్యే**
**స్వీయం సామ్యం విధత్తే భవతి నిరుపమస్తేన చాలౌకికోఽపి॥**

(అహో! జ్ఞానదాతుః, సద్గురోః, త్రిభువన–జఠరే, దృష్టాన్తః, ఏవ, న, దృష్టః। తత్ర, స్పర్శః, కల్ప్యః, చేత్ , యద్ (యద్యపి), (స్పర్శమణిః), అశ్మసారం, స్వర్ణతాం, నయతి, తథాపి, (సః), స్పర్శత్వం, న, (నయతి)। సద్గురుః, (తు), శ్రితచరణయుగే, స్వీయశిష్యే, స్వీయమ్, సామ్యమ్, విధత్తే, తేన (కారణేన), నిరుపమః, అలౌకికః, అపి, చ, భవతి।)

జ్ఞానమును ప్రసాదించే సద్గురువుకు సమానమైన వారు ఈ మూడు లోకములలో ఎవరూ లేరు. ఆయన్ని పోల్చగలదేమో అనిపించేది పరసుమణి (పరమ రత్నం), అది ఇనుమును బంగారంగా మారుస్తుంది. కానీ అది ఆ ఇనుమును పరసుమణిగా మార్చదు. అయితే సద్గురువు మాత్రం తన పాదములకు శరణాగతుడైన శిష్యునికి తన సొంత స్వరూపాన్నే ప్రసాదిస్తాడు. అందువల్ల, ఈ లోకానికి అతీతులైన సద్గురువుకు సరితూగే వారు లేరు.

**గురుపరమేశ్వరనమస్కారపూర్వకమధునా శఙ్కరప్రసాదినీ టీకా యయా**
**పరమేశ్వరో గురుశ్చ శఙ్కరో యస్మాదతిశయమలబ్ధ్వా తమబాదయో వ్యావృత్తాః,**



**ప్రసీదతి సా తస్య కృపాప్రసాదినీ వా టీక్యతే గమ్యతే**
**గ్రన్థార్థోఽనయా సా క్రియతే।**

పరమగురువులు మరియు పరమేశ్వరులకు నమస్కారపూర్వకముగా రచించబడేదే ఈ శంకరప్రసాదినీ టీకా. దేని ద్వారా శంకరులైన గురువు మరియు పరమేశ్వరులు ప్రసన్నులవుతారో ఆ టీకానే శంకరప్రసాదినీ టీకా, లేదా పరమేశ్వరులు మరియు గురువు యొక్క కృపా ప్రసాదం శంకరప్రసాదినీ. తమప్ మరియు ఇష్టన్ ప్రత్యయములు భగవత్పాద శంకరులకంటే శ్రేష్టమైన వారిని కనుగొనడంలో విఫలమయి, వెనుదిరిగి భగవత్పాదుల యందు సంతోషాన్ని వ్యక్తపరిచారు. గ్రంథము యొక్క అర్థము/జ్ఞానము దేని ద్వారా తెలియబడుతుందో అది టీకా.

**ప్రారీప్సితస్య గ్రన్థస్య నిర్విఘ్నపరిసమాప్త్యర్థం**
**పరిపన్థిదురితపరమ్పరానివారణాయ శిష్యోపశిష్యద్వారా ప్రచయప్రచారాయ**
**పరదేవతాతత్త్వానుస్మరణపూర్వకం తన్నమస్కారపూర్వకఞ్చ శిష్యానుష్ఠానలక్షణం**
**శిష్టాచారప్రమాణకం గురుప్రసాదలభ్యసర్వవేదాన్తసిద్ధాన్తసారసఙ్గ్రహస్య**
**మఙ్గలాచరణం గ్రన్థతో నిబధ్నాత్యఖణ్డానన్దసమ్బోధ ఇతి।**

**సంబంధోక్తి :** గ్రంథమును ప్రారంభించాలనే ఇచ్ఛతో విఘ్నాలు అనగా కఠినమైన ప్రతిబంధాల పరంపర తొలగిపోవడం కోసం, రచించబడిన గ్రంథాలు శిష్యులు మరియు వారి వారి శిష్యుల ద్వారా ప్రచారం కావడం కోసం, పరమాత్మ మరియు తత్త్వ(బ్రహ్మ) స్మరణ చేస్తూ, వారికి నమస్కరిస్తూ, శిష్యుల యొక్క అనుష్ఠానమే లక్షణముగా కలిగిన, గురువుల యొక్క ఆచరణ అనేది ప్రమాణకముగా కలిగిన మంగళాచరణమును, గురువు (గోవింద భగవత్పాదుల వారి)యొక్క అనుగ్రహం తో సర్వవేదాంతసిద్ధాంతసారసంగ్రహగ్రంథము యొక్క మంగళాచరణమును రచిస్తున్నారు–అఖండానందసంబోధ

**మఙ్గలాచరణమ్**

**అఖణ్డానన్దసమ్బోధో వన్దనాద్యస్య జాయతే।**
**గోవిన్దం తమహం వన్దే చిదానన్దతనుం గురుమ్ ॥1॥**

ఎవరికి వందనములు చేయడం వలన అఖండానందము యొక్క జ్ఞానము లభిస్తుందో చిదానందమునే తనువుగా కలిగిన ఆ గురువు గోవిందులకు నేను నమస్కరిస్తున్నాను.

**అఖణ్డో దేశకాలవస్తుపరిచ్ఛేదశూన్యశ్చానన్దో నిర్విశేషానన్దశ్చాఖణ్డానన్దస్తస్య**
**సమ్బోధః సమ్యగ్జ్ఞానమఖణ్డానన్దసమ్బోధః ప్రత్యక్చైతన్యాభిన్నో యస్య**

**వన్దనాత్ర్పహ్వప్రశ్రయసేవనాత్ "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా"**
**ఇత్యాది-స్మృతిభ్యో "యస్య దేవే పరా భక్తిః యథా దేవే తథా గురౌ? తస్యైతే**
**కథితా హ్యర్థాః ప్రకాశన్తే మహాత్మనః" ఇత్యాదిశ్రుతిభ్యశ్చ జాయత ఉద్బుధ్యతే**
**తంచిదానన్దతనుం చిదానన్ద ఏవ తనూ రూపం యస్య సః చిదానన్దతనుః,**
**గురుంగోవిన్దం గోభిర్వేదాన్తవాక్యైరేవ విద్యతే లభ్యత ఇతి గోవిన్దస్తమహం వన్దే నమస్కరోమి॥**

అఖండము అనగా దేశకాలవస్తుపరిచ్ఛేదము లేకపోవడము, ఆనందము అనగా ఎటువంటి విశేషణములు లేనిది, అదియే అఖండానందము, దాని యొక్క స్పష్టమైన జ్ఞానమే అఖండానందసంబోధము, ఇది ప్రత్యక్ చైతన్యము కంటే భిన్నముగా లేదు. నమ్రత, వినయ, విధేయతలతో ఆదరపూర్వకముగా ఎవరిని సేవించడం వలన, ఎవరిని ప్రార్థించడం వలన ఈ జ్ఞానము లభిస్తుందో ఆ చిదానందులకు అనగా చిదానందమునే తనువుగా స్వరూపముగా కలిగిన పరమగురువు గోవింద భగవత్పాదులకు నేను నమస్కరిస్తున్నాను. గోవిందులు అనగా వేదాంత వాక్యాల ద్వారా మాత్రమే పొందగలిగేది లేదా తెలుసుకునేది. "ప్రణామములు చేస్తూ, ప్రశ్నిస్తూ, సేవ చేస్తూ దానిని తెలుసుకొనుము. భ.గీ- 4.34""భగవంతుడి యందు ఉన్న భక్తి గురువుయందు ఎవరికైతే ఉంటుందో ఆ మహాత్ములకు(సాధకులకు) ఉపనిషత్తులు తెలియజేసే జ్ఞానం లభిస్తుంది. శ్వే.ఉ-6.23" అని మొదలైన శ్రుతులు తెలియ జేస్తున్నాయి.

**అఖణ్డానన్దసమ్బోధ ఇతి పదేన త్వమ్పదలక్ష్యార్థ ఉచ్యతే।**
**గోవిన్దం చిదానన్దతనుమితి పదద్వయేన తత్పదలక్ష్యార్థో బ్రహ్మోచ్యతే ।**
**యస్య గురోః ప్రసాదేనాహం బ్రహ్మాస్మీతి బోధో జాయతే తన్నమస్కరోమీత్యర్థః॥**

అఖండానందసంబోధ అనే పదము ద్వారా త్వంపద లక్ష్యార్థమును సూచిస్తున్నారు. గోవిందం చిదానందతనుం అనే ఈ రెండు పదాల ద్వారా తత్పద లక్ష్యార్థము బ్రహ్మను సూచిస్తున్నారు. ఏ గురువు యొక్క అనుగ్రహము వలన "నేను బ్రహ్మ" అనే జ్ఞానము లభిస్తుందో ఆ పరమగురువుకు నమస్కరిస్తున్నాను అని అర్థం.

**అఖణ్డానన్దసన్దోహ ఇతి పాఠేఽఖణ్డానన్దస్య సన్దోహః**
**ప్రచురానుభవో జాయత ఇతి।**

అఖండానందసందోహ అనే మరొక పాఠ భేదము కలదు. అక్కడ అఖండానందము యొక్క అనుభవము అనగా ప్రచురానుభవము, స్పష్టమైన జ్ఞానము ఉత్పన్నమగును అని అన్వయము.



**అస్యగ్రన్థస్య వేదాన్తశాస్త్రప్రకరణ రూపత్వాచ్ఛా స్త్రైకదేశ సమ్బద్ధ**
**త్వాదిలక్షణత్వాచ్చానుబన్ధచతుష్టయప్రదర్శనేనాపి మఙ్గలం కరోతి।**

ఈ గ్రంథము వేదాంతశాస్త్రం యొక్క ప్రకరణరూపము అయినందువలన, శాస్త్రైకదేశసంబద్ధత్వాది లక్షణము కలిగినదై ఉండడం వలన అనుబంధ చతుష్టయము ద్వారానే మంగళాచరణం చేస్తున్నారు.

**యథా "సమ్బన్ధశ్చాధికారీ చ విషయశ్చ ప్రయోజనమ్।**
**వినానుబన్ధం గ్రన్థాదౌ మఙ్గలం నైవ శస్యతే"ఇతి।**
**తత్ర గ్రన్థాధ్యయన ప్రవృత్తి పయోజకజ్ఞాన విషయ త్వమనుబన్ధత్వమ్। అఖణ్డమితి**

అధికారి, విషయము, ప్రయోజనము, మరియు సంబంధము లేకుండా గ్రంథము అనేది మంగళప్రదం కాదు. అనుబంధము అనగా గ్రంథమును అధ్యయనం చేయాలనే ప్రవృత్తి ఏ జ్ఞానము ద్వారా ఏర్పడుతుందో ఆ విషయము అనుబంధము.

అఖండం

## సామవేద శాంతిమంత్ర

**ఓం ఆప్యాయంతు మమాంగాని వాక్-ప్రాణశ్చక్షుః**
**శ్రోత్రమథో బలమింద్రియాణి చ సర్వాణి ॥**
**సర్వం బ్రహ్మోపనిషదంమాహం బ్రహ్మ నిరాకుర్యాం మా మా బ్రహ్మ నిరాకరోద్**
**అనిరాకరణమ-స్త్వ నిరాకరణం మేఽస్తు తదాత్మని నిరతే య ఉపనిషత్సు**
**ధర్మాస్ తే మయిసంతు తే మయి సంతు**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

నాయొక్క దేహ అంగాలు వృద్ధి చెందాలి. వాక్కు, ప్రాణములు, చక్షువులు, శ్రోత్రములు సర్వ ఇంద్రియాలు బలంగా ఉండాలి. సర్వం ఉపనిషత్తు ద్వారా తెలియజేయబడే బ్రహ్మ. నేను బ్రహ్మను నిరాకరించకూడదు. బ్రహ్మ నన్ను నిరాకరించకూడదు. నేను బ్రహ్మను తెలుసుకోవాలి. బ్రహ్మను తెలుసుకోవడంలో ఎటువంటి ప్రతిబంధాలు ఉండకూడదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః అనగా ఆదిదైవిక, ఆధ్యాత్మిక, ఆదిభౌతిక తాపాలు తొలగిపోవాలి.

**ఉపనిషద్ నిర్వచనం**
**ఉపనియేమం ఆత్మానం బ్రహ్మాపాస్తద్వయం యతః ।**
**నిహంత్యవిద్యా తజ్జంచ తస్మాదుపనిషద్భవేత్ ॥**

ఉపనిషత్తు జీవాత్మను ద్వైత రహితమైన బ్రహ్మ దగ్గరకు తీసుకువెళుతుంది. అవిద్యను మరియు అవిద్యాకార్యమును నిర్మూలిస్తుంది. అందువలన దీనిని ఉపనిషత్ అన్నారు.

## దక్షిణామూర్తి స్తోత్రం

# మానసోల్లాసం


**రచన: దక్షిణామూర్తి స్తోత్రం - భగవత్పాదులు శ్రీ ఆది శంకరాచార్యులు**

**మానసోల్లాసము-శ్రీ సురేశ్వరాచార్యులు, టీకా - శ్రీ రామతీర్థగారు,**

**(గత సంచిక తరువాయి) ఆంగ్ల మూలం - పూజ్య స్వామి బోధాత్మానంద గారు.**


**ఆత్మలాభాత్పరో లాభో నాస్తీతి మునయో విదుః ।**

**తల్లాభార్థం కవిస్తౌతి స్వాత్మానం పరమేశ్వరం ॥2॥**

ఆత్మలాభాత్= ఆత్మ లాభాముకంటే (ఆత్మను పొందడం కంటే), పరో లాభః= గొప్పలాభం, నాస్తి=లేదు, ఇతి=ఇది, మునయః=మునులు, విదుః=తెలియజేస్తున్నారు, తత్ లాభార్థం=అ(ఆత్మ) లాభం కోసం, కవిః=కవి (భగవత్పాద శ్రీ శంకరాచార్యులు), స్వాత్మానం= తన యొక్క ఆత్మను, పరమేశ్వరం=పరమేశ్వరుడిని, స్తౌతి=స్తుతిస్తున్నాడు. కవిః=క్రాంతదర్శి (సత్యాన్ని దర్శించినవారు/తెలుసుకున్నవారు).

ఆత్మను పొందడం (తెలుసుకోవడం) కంటే మరొకటి ఏదీ ముఖ్యం కాదని మునులు, జ్ఞానులు తెలియజేస్తున్నారు. ఆ ఆత్మను పొందడం కోసం ఆత్మ అయిన పరమేశ్వరుడిని భగవత్పాద భాష్యకారులు స్తుతిస్తున్నారు.

ఆత్మలాభః - ఆత్మనః లాభః ఆత్మ యొక్క నిర్వచనం:

**యచ్చాప్నోతి యదాదత్తే యచ్చాత్తి విషయానిహ ।**

**యచ్చాస్య సంతతోభావస్తస్మాదాత్మేతి కీర్త్యతే ॥**

యత్=ఏదైతే, ఆప్నోతి=వ్యాపించిఉందో, చ=మరియు, యత్=ఏదైతే, ఆదత్తే= లయం చేస్తుందో (ఈ జగత్తుకంతటికీ ఉపాదాన కారణం ఆత్మ), యత్=ఏదైతే, అత్తి=భక్షిస్తుందో, విషయాన్=విషయాలను, ఇహయత్=ఏదైతే, అస్య సంతతో భావః=అధిష్ఠాన సత్తా కాకుండా మరొక సత్తా లేదు, తస్మాత్=అందువలన, ఇతి=దీనిని, ఆత్మా=ఆత్మ అని, కీర్త్యతే=కీర్తించారు (తెలియజేశారు).

ఏదైతే జాగ్రత్ స్వప్న సుషుప్తిలో వ్యాపించినదో అదే ఆత్మా స్థూల సూక్ష్మకారణ శరీరాలు ఎక్కడైతే లయమవుతున్నాయో అదే ఆత్మ అనగా ఈ జగత్‌కు ఉపాదాన కారణం (ముడి సరుకు) ఆత్మ. ఏదైతే విషయాలను ప్రతిబింబము ద్వారా అనుభవిస్తుందో అదే ఆత్మ. అన్నింటికీ అధిష్ఠానముగా ఉంటూ దానికంటూ మరొక అధిష్ఠానము అవసరం లేనిదే ఆత్మ అని తెలియజేశారు.

ఈ ఆత్మను తెలుసుకోవడం కంటే మరొక ప్రయోజనం ఏదీ లేదు. ఈ ఆత్మ ఎల్లప్పుడూ ఉంది, కానీ అజ్ఞానం వలన నేను దానిని తెలుసుకోలేకపోతున్నాను. అజ్ఞానమును తొలగించడం వలన ఈ ఆత్మ లభ్యమవుతుంది. అనగా ఆత్మను



తెలుసుకోగలుగుతాము. ఆత్మను తెలుసుకోవడమంటే ప్రవచనం జరుగుతున్నప్పుడు నేను ఆత్మని అని భావించి ప్రవచనం అయిపోగానే నేను వ్యక్తిని అని భావించడం ఆత్మను తెలుసుకోవడం కాదు. నేను ఎల్లప్పుడూ అదే అయి ఉన్నాను, ఎప్పటికీ నేను దానిని కోల్పోను అని అర్థంచేసుకోవడం.

ఎందుకు ఆత్మలాభము అన్నింటికంటే ఉన్నతమైన లాభము?

ఇతర వస్తువులు, వ్యక్తులు, దేశము, కాలము ఇవన్నీ పరిచ్ఛిన్నమైనవి (పరిమితమైనవి), వీటిని పొందినా కూడా ఇవి అనిత్యం అందువలన వీటిని కోల్పోవ డానికి అవకాశం ఉంటుంది. కర్మ ద్వారా ఏది పొందినా అది క్షయం అవుతుంది. స్వర్గలోకాన్ని పొందినాకూడా దానిని కోల్పోతాము. "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి" మరల ఈ మర్త్యలోకాన్ని పొందుతాము. ఈ రకంగా అవన్నీ అనిత్యం. ఇవేవీ కూడా పూర్తి తృప్తిని ఇవ్వవు ఎందుకనగా ఒకసమయంలో కాకపోయినా ఇంకొక సమయంలో ఇది నాకు వద్దు అనిపిస్తుంది ఏదైదే నాకు వద్దు అనుకుంటానో అది పక్కన పెట్టాలి అనిపిస్తుంది. కానీ నాయొక్క స్వరూపంలో ఉండడం నాకు ఎప్పుడూ భారంగా ఉండదు. నేను కొంతదూరం నడుస్తున్నాను. నాతో పాటుగా ఒక సంచి ఉంది ఆ సంచిలో ఏమీ లేకపోయినా అది నాకు భారంగా అనిపిస్తుంది, అది నాకు బంధనముగా ఉంది. దాన్ని వదిలిపెడితే ఎటువంటి బంధనం ఉండదు. ఈ విధంగా ఆత్మలాభము యొక్క మహత్త్వమును తెలుసుకున్నప్పుడు మాత్రమే దానిని పొందడంకోసం నా ప్రయత్నం తీవ్రంగా ఉంటుంది.

జీవుడిగా ఏదైతే గుర్తిస్తున్నామో అదే స్వాత్మానం, తెలియని అంశం ఏదైతే ఉందో అది పరమాత్మ. నా గురించి నాకు తెలుసు. నీగురించి నీకు ఏమని తెలుసు? నా గురించి నాకు కర్త, భోక్త అని తెలుసు కానీ నేను పరమేశ్వరుడిని అని తెలియదు. జీవుడే బ్రహ్మగా తెలుసుకోవాలి. అందువలన "ఆత్మానాం పరమేశ్వరం స్తౌతి" ఈ ఆత్మ పరమాత్మకంటే వేరుగా లేదు, ఆ ఆత్మ స్తుతించబడుతుంది.

**శాస్త్రం:** "ఏకదేశ ఉపనిబద్ధం అశేష అర్థ ప్రతిపాదకం హి శాస్త్రం". ఒకే ప్రయోజనాన్ని కలిగి ఉండి అనేక అంశాలతో అనుసంధానం అవుతూ అన్నింటినీ పూర్తిగా వివరించేదే శాస్త్రం.

**శాస్త్రంలో ఉండే అంశాలు:** 1.అధికారి, 2.గురువును సమీపించడం (గురూ పసత్తి) 3.గురువు 4.జీవుడు 5.చైతన్యముతో సహా జీవ ఉపాధి, చైతన్యముతో సహా ఈశ్వర ఉపాధి 6.జీవ చైతన్యము, ఈశ్వర చైతన్యము, 7.జీవుడు ఈశ్వరుడు ఒక్కటే 8.విరోధము (సందేహములు) 9. పరిహారము 10.సాధన 11.ఫలము.

**వేదాంతము:** "వేదానాం అంతః నిర్ణయః" వేదాలయొక్క సారమే వేదాంతం. బ్రహ్మను తెలుసుకోవాలనే కోరిక తీరడమే వేదాంతం.

**ప్రకరణం గ్రంథం :**

శాస్త్రైకదేశసంబద్ధం శాస్త్రకార్యాన్తరే స్థితం ।
ఆహుఃప్రకరణం నామ గ్రంథభేదం విపశ్చితః ॥

శాస్త్రంలోని ఒక అంశమును లేదా కొన్ని అంశాలను చర్చించేది, శాస్త్రము యొక్క విషయమును, ప్రయోజనమును కలిగి ఉంటూ వేరొక విధంగా వివరణ ఇచ్చేది లేదా శాస్త్రము ద్వారా వ్యక్తము కానటువంటి విషయమును వ్యక్తము చేసేదే ప్రకరణ గ్రంథం అని గ్రంథ భేదమును తెలిసిన విద్వాంసులు పేర్కొన్నారు.

వేదాంతశాస్త్రము (ఉపనిషద్, భగవద్గీత, బ్రహ్మసూత్ర), ఉదా: "అనేన జీవేన ఆత్మనా అనుప్రవిష్య నామరూపే వ్యాకరవాణి" అని ఉపనిషత్తు చెబుతుంది. శుద్ధ చైతన్యము బుద్ధిలోకి ప్రతిబింబముగా ప్రవేశించినప్పుడు ఈ ప్రతిబింబం ఎలా పనిచేస్తుంది? ఈ ప్రతిబింబం ఎలా మార్పులు చెందుతుంది? ఉపాధిలో ఏర్పడే మార్పుల వలన ప్రతిబింబంలో మార్పులు కనబడుతున్నాయి. ఉపాధి పరిచ్ఛిన్నము కావడం వలన ప్రతిబింబం (చిదాభాస) పరిచ్ఛిన్నమవుతుంది.

ప్రస్థానత్రయము కానివన్నీ ప్రకరణగ్రంథాలుగా చెప్పవచ్చు. బృహత్రస్థానము, సిద్ధిగ్రంథాలను మినహాయించినా కూడా అవి కూడా మరొక విధమయిన ప్రకరణ గ్రంథాలే. వీటిలో అధికారి, అధికారి యొక్క యొక్క అర్హతలు, గురువును సంప్రదించడం మొదలైన అంశాలు ఉండవు.

**ప్రయోజనము :** ఆత్మలాభము, ఆత్మను తెలుసుకోవడం

**విషయము :** ఆత్మ మరియు పరమేశ్వరుడి ఐక్యము

**రా.టీ.:** ఈస్తోత్రం శాస్త్రం ఏకదేశ సంబద్ధత్వాన్ని కలిగి ఉన్నందువలన ఇది వేదాంత శాస్త్ర ప్రకరణ గ్రంథం. దానిని (శాస్త్ర ఏకదేశ సంబద్ధత్వాన్ని) వ్యక్తపరచడం కోసం విషయము మరియు ప్రయోజనము ఈ శ్లోకములో వివరిస్తున్నారు.

The mind uncontrolled and unguided will drag us down, down for ever - rend us, kill us, and the mind controlled and guided will save us, free us.

గమ్యం తెలియక, నియంత్రణ లేని మనస్సు మనల్ని పతన మొందిస్తుంది. అధోగతి పాలు చేస్తుంది. నిగ్రహంతో, లక్ష్యంవైపు సాగిపోయే మనస్సు విముక్తిని ప్రసాదించి, విజయ శిఖరాలను అధిరోహింప జేస్తుంది.

All Knowledge depends upon the calmness of mind.

ఆజ్ఞ సముపార్జనకు ప్రశాంతమైన మనస్సే ప్రధానం.



# ప్రతిమా పూజ

డా॥ ఎమ్.ఎస్. కృష్ణవేణి, విశాఖపట్నం

శ్లో॥ నా కాంశ్యే విద్యతే దేవో, న పాషాణే, న మృణ్మయే,
భావే హి విద్యతే దేవః, తస్మాత్ భావో హి కారణమ్

ఆ॥ పసిడి-చెక్క-మట్టి ప్రతిమల, శిలలందు
జూడలేము దేవుజాడొకింత
భావమందె యుండు పరమమౌ దైవంబు
కాన భావ మొకటె కారణంబు

తా: బంగారం, చెక్క, మట్టి, శిల వీటితో చేసిన ప్రతిమలను పూజిస్తూ వుంటాము. వాటిలో దేవుని ఉనికిని కొంచెమైనా అనుభవించలేము. ఆ పరదైవం మన భావనలోనే ఉంటాడు. కనుక భావన ఒక్కటే మూలకారణం.

ప్రతిమ అచేతనం గనుక భగవంతుడు అదే అనుకుంటే ఆయన కూడా అచేతనుడవుతాడు. అప్పుడు చైతన్యాత్మకమైన అనుభూతికి అవకాశమే ఉండదు. నిజానికి భగవంతుడు నిత్యచైతన్య స్వరూపుడు. ఆయనను పొందాలంటే చైతన్య రూపమైన భావనతోనే సాధ్యమవుతుంది. కనుక భావనా రూపమైన ఉపాసనే భగవంతుని పొందడానికి మూలాధారమని భావం.

మరి ప్రతిమా పూజకు ప్రయోజనమే లేదా? అంటే ఆ ప్రతిమను కూడా చైతన్య రూపంగా భావించగలిగితే-నిజానికి సర్వం చైతన్యమయం గనుక-తప్పక ప్రయోజనం ఉంటుంది. ఆ దృష్టితోనే ప్రాచీనకాలం నుండి ప్రతిమా పూజను ఆచరిస్తున్నారు.

"ప్రథమా ప్రతిమాపూజా, జపస్తోత్రాణి మధ్యమా,
ఉత్తమా మానసీ పూజా, సోహం పూజోత్తమోత్తమా" (తంత్రసారము)

ప్రతిమాపూజతో మొదలుపెట్టి, జపము-స్తోత్రమును చేస్తూ మధ్యమస్థాయిని చేరుకొని, మానస పూజ అనే ఉత్తమ స్థితిని పొందాలి. చివరకు భగవంతుని లోనే నేనున్నాను గనుక ఆయనే నేను అనే పూజ ఉత్తమోత్తమమైనది.

అంతరంగ హృదయ మందగా సాధించి
చింతలూడ బెటికి చిక్కుపడక
వింత జూచి మెలగ విజ్ఞానమందురా
విశ్వదాభిరామ వినురవేమ!

మనస్సును చెడ్డపనుల మీదికి పోనీక లోబరుచుకొని, విచారముల నడచి ఆత్మజ్ఞానము నార్జింపవలెను.

## కార్యక్రమములు-మాతృఆశ్రమం

**ది.08-08-2025 శుక్రవారము :** వరలక్ష్మివ్రతం

**ది.15-08-2025 శుక్రవారము :** స్వాతంత్ర్యదినోత్సవం

**ది.18-08-2025 శుక్రవారము :** శ్రీకృష్ణాష్టమి
ఉ॥7.30ని॥లకు శ్రీకృష్ణ అష్టోత్తరశత నామార్చన
రా॥9.00గం॥లకు సంకీర్తన
రా॥12.00 గం॥లకు డోలాఉత్సవం

**ది.23-08-2025 బుధవారము :** పోలాల అమావాస్య
గం॥10.30ని॥లకు అన్నపూర్ణా సదనంలో
దుర్గా అష్టోత్తర శతనామార్చన

**ది.27-08-2025 బుధవారము :** వినాయక చతుర్థి
శాంతి గణపతికి అష్టోత్తర శతనామార్చన

కాకినాడ బ్రాంచ్ శాంతి ఆశ్రమంలో 21 జూన్ యోగ డే, పతంజలి యోగ సభ్యులు, ఉదయం 9.30 నుండి 12 వరకు మరియు స్వచ్ఛభారత్ యోగ మండలి వారు సాయంత్రం 6.00 నుండి 8.30 వరకు యోగ డే కార్యక్రమాలు చాలా ఘనంగా చేసారు. తదుపరి ప్రసాద వితరణ చేశారు.

జూలై 10వ తేదీ గురు పౌర్ణమి సందర్భంగా ఉ॥9-12గం॥ పతంజలి యోగ మండలి వారు, సా॥ 5-9గం. వరకు స్వచ్ఛ భారత్ యోగ మండలి వారు చాలా ఘనంగా వ్యాసపూర్ణిమ వేడుకలు జరిపించారు. తదుపరి ప్రసాద వితరణ చేశారు.

| | |
|---|---|
| **1. మాతృ ఆశ్రమం**<br>శ్రీ శాంతి ఆశ్రమము<br>తోటపల్లి కొండలు,పిన్ : 533 446<br>వయా శంఖవరం, కాకినాడ జిల్లా<br>సెల్ :7382009962<br>రిసెప్షన్ : 7815890094<br>e-mail : srisanthiashram@gmail.com | **4. కోటగిరి శాఖ**<br>పీస్ సెంటర్, డార్మోనా రోడ్,<br>కోటగిరి-643217, నీలగిరిజిల్లా,<br>తమిళనాడు,<br>ఫోన్ : 04266- 271945<br>e-mail: vsvmsktg@yahoo.com<br>vsvmsktg@gmail.com |
| **2. విశాఖ : శాంతి ఆశ్రమము**<br>లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017<br>విశాఖపట్నం<br>ఫోన్ : 0891 - 2538689<br>e-mail : srisanthiashramvsp@gmail.com | **5. కాకినాడ శాఖ**<br>శాంతి ఆశ్రమము,అశోక్ నగర్<br>కాకినాడ - 533 004<br>కాకినాడ జిల్లా |
| **3. విశ్వశాంతి క్షేత్రం**<br>కైలాసగిరి<br>విశాఖపట్నం | **6. పిఠాపురం శాఖ**<br>స్టువర్టు పేట,పిఠాపురం-533 450<br>కాకినాడ జిల్లా |

Website : www.srisantiashram.org



## విరాళములు

1. శ్రీమతి కృష్ణవేణి గారు (విశాఖపట్నం) 3,001/-
2. శ్రీ కొల్లి ప్రసాద్ గారు (శాంతి ఆశ్రమం) వీరి కుమారుడు శ్రీ కె.సాయిప్రసాద్ గారి వివాహ సందర్భముగా అన్నదానం 10,500/-
3. శ్రీ యింటి చిన్న వెంకట రామారావు గారు (వెంకటకృష్ణరాయపురం) గోశాల నిమిత్తం 5,000/-
4. శ్రీమతి వి. ఉమగారు (కోటగిరి) 10,000/-
5. శ్రీమతి జి.మాధవిగారు (విజయవాడ) వీరి కుమార్తె డా॥అనూష గారు, వివాహ సందర్భముగా అన్నదానం 5,000/-
6. శ్రీ పుప్పాల సుబ్బలక్ష్మీదేవి గారు మరియు (లేటు) శ్రీ భగవాన్ మాష్టారు (పెద్దాపురం) శ్రీ శాంతమ్మగారి జ్ఞాపకార్థం 3,000/-
7. శ్రీ పి. హరికుమార్ శర్మగారు (శాంతి ఆశ్రమం) యోగా డే సందర్భముగా 5,000/-
8. శ్రీమతి రేణుక అశోక్‌కుమార్ గారు (చెన్నై) అన్నదానం నిమిత్తం 6,000/-
9. శ్రీ బి. సువర్ణదేవి గారు (ఖమ్మం) 6,000/-
10. శ్రీమతి ఎస్.ఎస్.రేణుక ప్రియగారు (విశాఖపట్నం) వీరి తండ్రి లేటు వి.సాంబశివరావు గారి జ్ఞాపకార్థం అన్నదానం నిమిత్తం 10,000/-
11. డా॥ విజయకృష్ణకుమార్ గారు (రాజమండ్రి) 5,000/-
12. శ్రీ పోసిన సత్తిబాబు, వెంకటలక్ష్మిగారు మరియు శ్రీమతి మాలతీదేవిశ్రీ కాశిగార్లు (కాకినాడ) వీరి తల్లి సత్యవతి గారి జ్ఞాపకార్థం 5,000/-

## శాశ్వత అన్నదానం

1. శ్రీ వట్టం శ్రీనివాసరావు గారు (విశాఖపట్నం) 10,000/-
2. శ్రీ డా॥ బైపల్లిరమేష్ గారు & శ్రీమతి బైపల్లి ప్రశాంతి గారు (విశాఖపట్నం) వీరి తండ్రి శ్రీ బి. దుర్యోధన్ గారి జన్మదినం సందర్భముగా 10,000/-
3. శ్రీ డా॥ బైపల్లి రమేష్ గారు & శ్రీమతి బైపబల్లి ప్రశాంతిగారు (విశాఖపట్నం) వీరి తల్లి శ్రీమతి బైపల్లి సరోజినీదేవి గారి జన్మదినము సందర్భముగా 10,000/-

ఓం

## అంతర్జాతీయ యోగా దినోత్సవము

పూజ్యశ్రీ ఓంకార స్వామీజీ ఆశీస్సులతో పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడెను.

ది. 21-05-2025 శనివారము అంతర్జాతీయ యోగ దినోత్సవము సందర్భముగా శాంతి ఆశ్రమము గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పూజ్యశ్రీ శారదానంద మాతాజీ గారు, శ్రీమతి శ్రీ.సుగుణగారు (విజినగిగి యోగచైతన్య రామం) వారిచే యోగాసనములు, ప్రాణాయామములు నిర్వహించబడినవి. గురుకుల కరెస్పాండెంట్ పి.హరికుమార్, ఎమ్. శర్మగారు, సి.హెచ్.సుచరిత (ప్రిన్సిపాల్) గారు, బి.సీత గారు ఉపాధ్యాయులు విద్యార్థులకు అన్నివిధములుగా సహాయ సహకారములు అందించిరి.

ప్రెసిడెంట్ ఎమ్.ఎన్.ఆదిత్యగారు, వెంకటరమణరెడ్డిగారు మరియు యోగాచార్య తాతాజి గారు ఈ విధంగానే విశాఖ శాంతి ఆశ్రమ శాఖలో నిర్వహించిరి. అదే విధంగా కోటగిరి శాంతి ఆశ్రమంలో కరస్పాండెంట్ పి. సాయిబాబా గారు, ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయ బృందం నిర్వహించిరి.

తదుపరి కాకినాడ శాఖలో నల్లం సత్యనారాయణగారు కూడా నిర్వహించారు.

### శాంతి ఆశ్రమ శ్రేయోభిలాషులకు విన్నపము

### గోమాత స్తుతి

పూజ్యశ్రీ ఓంకార స్వామీజీ వారు స్థాపించిన గోశాల 128 సం॥లు పూర్తి కావస్తున్నది. ఇప్పటికీ ఆశ్రమ గోశాలలో వందకు పైగా గోవులున్నవి. వాటిలో ఎక్కువగా 90 శాతము వృద్ధాప్యము చెందినవి, గిత్తలున్నవి. వీటి కార్య నిర్వాహణము కష్టమవుతున్నది. వీటికి గోగ్రాసము ఒక ఆవునకు ఒక రోజునకు సుమారు 200/-లు ఖర్చవుతున్నది. గోసేవ వలన 100 అశ్వమేధయాగముల ఫలితము లభించునని శాస్త్రము చెప్పుచున్నది. ఈ విషయాన్ని ఆశ్రమ శ్రేయోభిలాషులు గమనించి వారి శక్త్యానుసారం 10 రూ॥ల నుండి ఎంతవరకైనా అందించగలరని మా విన్నపము. గోవులు తమ శరీరము రుద్దుకోవడం కోసం రాతి స్తంభములు అవసరం ఉన్నవి. ఒక స్తంభమునకు సుమారు రూ. 10,000/-లు ఖర్చవుతుంది. 30 స్తంభములు అవసరమున్నవి. దాతలు ఈ స్తంభములకై సహకారాన్ని అందించ వలసిందిగా మా విజ్ఞప్తి.

దాతల పేర్లు శిలాఫలకంపై చెక్కబడును.

భగవంతుడి అనుగ్రహము, పూజ్యశ్రీ ఓంకార స్వామీజీ వారి మరియు పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ ఆశీస్సులు లభించుగాక!

**ఇట్లు**
**గురుసేవలో**
స్వామిని వినమ్రానంద



## దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

## శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

## విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001

A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104

# శ్రీ శాంతి ఆశ్రమ ప్రచురణలు

| | |
|---|---|
| 1. శాంతి ప్రదాత శ్రీ స్వామి ఓంకార్ ఆత్మకథ | 100/- |
| 2. ఓంకార సద్బోధామృతము | 70/- |
| 3. సోహం | 10/- |
| 4. ఓం జపం | 10/- |
| 5. మౌనపు ఘడియలు | 30/- |
| 6. ప్రేమయే దైవము | 10/- |
| 7. భగత్సాక్షాత్కారము ఇప్పుడు ఇక్కడే | 10/- |
| 8. శాంతి దళములు | 10/- |
| 9. ఆధ్యాత్మిక మెరుపులు | 10/- |
| 10. సత్సంగ సందేశములు | 30/- |
| 11. ఓంకార సూక్తులు | 10/- |
| 12. ఓంకార స్తోత్ర కదంబం | 10/- |
| 13. శాంతి సూక్తులు | 10/- |
| 14. శాంతి ప్రార్థన | 20/- |
| 15. శ్రీ శాంతి స్తోత్రమాల | 30/- |
| 16. స్వామి ఓంకార్ ఆత్మదర్శిని | 20/- |
| 17. సందేశ తరంగిణి | 40/- |
| 18. నా చెల్లి పునర్జన్మ | 10/- |
| 19. నేను ఆంగ్లభాష ఎలా నేర్చుకొన్నాను. | 20/- |
| 20. శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామి స్తోత్రము | 20/- |
| 21. శాంతి దూత స్వామి ఓంకార్ | 30/- |
| 22. స్వామి ఓంకార్ జీవిత విశేషాలు | 10/- |
| 23. శ్రీ శాంతి ఆశ్రమ చరిత్ర (1917-2020) | 100/- |
| 24. ధ్యానము | 30/- |
| 25. పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి దివ్య సందేశములు దేశ విదేశీయ పర్యటనలు | 50/- |
| 26. ప్రార్థనలు - ధ్యానములు | 20/- |
| 27. విశ్వ ప్రార్థన | 20/- |
| 28. శ్రీ శాంతి ఆశ్రమం శతాబ్ది సంచిక | 120/- |
| 29. నిత్య సందేశములు | 20/- |
| 30. ఆంతర్య భావనలు | 20/- |
| 31. శ్రీ ఓంకార బోధామృతం | 20/- |
| 32. నాల్గు దశలలో ఉపదేశము | 10/- |
| 33. శాంతి ప్రార్థన - స్వామి ఓంకార్ | 20/- |

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57, Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2024-2026

# SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

| | |
|---|---|
| 1. Auto Biography of swami Omkar (2 Volumes) | Rs. 150/- |
| 2. Life and Teachings of Swami Omkar | Rs. 10/- |
| 3. Soham | Rs. 10/- |
| 4. Cosmic Fast | Rs. 20/- |
| 5. Meditation | Rs. 10/- |
| 6. Om Japa | Rs. 10/- |
| 7. Control of Mind | Rs. 30/- |
| 8. Cosmic Flashes | Rs. 10/- |
| 9. In the Hours of Silence | Rs. 10/- |
| 10. The Soul of Omkar | Rs. 10/- |
| 11. How I learned English | Rs. 10/- |
| 12. Reincarnation of my Little Sister | Rs. 10/- |
| 13. God Realization Now and Here | Rs. 10/- |
| 14. Mystic Prayers and Poems | Rs. 20/- |
| 15. The Divine Voice of Omkar | Rs. 40/- |
| 16. Auto Biography of Omkar (Revised Edition) | Rs. 100/- |
| 17. Petals of Peace | Rs. 20/- |
| 18. The Story of my life and Work | Rs. 10/- |
| 19. Priceless legacy of Swami Omkar | Rs. 10/- |
| 20. The Four Initiations | Rs. 10/- |
| 21. Musings | Rs. 20/- |
| 22. Peace Prayer | Rs. 20/- |

THE MISSION OF PEACE
శ్రీ శాంతి ఆశ్రమము
పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
కాకినాడ జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

________________________________

________________________________

________________________________

Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda